నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | డిసెంబర్ 13, 2024 | www.navatelangana.com

పెరుగుతున్న చలి

- శనగ పంటకు మేలు చేస్తుందంటున్న రైతులు



నవతెలంగాణ-మద్నూర్

గత రెండు మూడు రోజులుగా చలి పెరిగింది. దీంతో శనగ పంటకు చలి బాగా ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. వారం పది రోజుల క్రితం నుంచి చలి లేకపోవడంతో రబీ పంటలు ఎదగడంలో రైతన్నలో ఆందోళన కలిగించింది. అయితే గత మూడు నాలుగు రోజులుగా చలి పెరిగింది. దీంతో శనగ పంటకు కళ వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చలి ఎంత ఎక్కువగా ఉంటే పంట అంత బాగా ఎదుగుతుందని రైతులు చెబుతున్నారు. మద్నూర్ ఉమ్మడి మండలంలో మద్నూర్ డోంగ్లి మండలాల పరిధిలో అత్యధికంగా రైతులు శనగ పంటను సాగుచేశారు. దాదాపు 21 వేల ఎకరాలపైన శనగ పంట సాగు అయినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

కేజీబీవీలో ఎంఈఓ నాగయ్య బోధన



నవతెలంగాణ-బోధన్

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెతో కేజీబీవీలో విద్యాబోధన నిలిచిపోవడంతో నవతెలంగాణ దినపత్రికలో గురువారం కథనం ప్రచురితమైంది. దీంతో ఎంఈఓ నాగయ్య గురువారం అమ్దాపూర్‌లోని కేజీబీవీని సందర్శించి విద్యార్థులకు బోధించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కేజీబీవీలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు.

నేడు నిజాంసాగర్ నీటి విడుదల

- హాజరుకానున్న ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్న మంత్రి



నవతెలంగాణ-నిజాంసాగర్/కంఠేశ్వర్

మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంటల సాగు కోసం నీటిని విడుదల చేయ్యడానికి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టుకు రానున్నారు. ఉదయం బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10 గంటల వరకు నిజాంసాగర్ ప్రాజెక్టుకు చేరుకోనున్నారు. ప్రాజెక్టు నుంచి నీటిని వదిలిన అనంతరం నిజామాబాద్ జిల్లాలోని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుకు చేరుకోనున్నారు. అక్కడ నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అందుకనుగునంగా సంబంధిత శాఖ అధికారులు ఉమ్మడి జిల్లాల్లో ఏర్పాట్లను పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

17న చలో హైదరాబాద్

- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.వెంకట్‌గౌడ్



నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాలు (జేఏసీ) ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.వెంకట్‌గౌడ్ తెలిపారు. 17.12.2024 ఇందిరా పార్కులో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు (జేఏసీ) నిర్ణయించిందని పేర్కొన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల సంఘం (సిఐటియు) జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, జిల్లాలోని మండలంలో పంచాయతీ బాధ్యులు కార్మికులను ఐక్యం చేసి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మోడల్ హాస్టల్లో

హెడ్ కుక్ పోస్టుకు మోక్షమెప్పుడో..?

- ఆరు నెలలుగా హెడ్ కుక్ పోస్టు ఖాళీ!
- జులైలోనే దరఖాస్తుల స్వీకరణ
- నవంబర్ 23న పూర్తయిన ఇంటర్వ్యూ - ఇబ్బందుల్లో విద్యార్థినీలు

నవతెలంగాణ-నవీపేట్

గ్రామీణ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో గత కాంగ్రెస్ ప్రభుత్వం మోడల్ పాఠశాలలను నిర్మించడమే కాక విద్యార్థినుల సౌకర్యార్థం వసతి గృహాలను సైతం ఏర్పాటు చేసింది. అధికారుల అలసత్వం కారణంగా మండల కేంద్రంలోని మోడల్ హాస్టల్‌లో గత ఆరు నెలలుగా హెడ్ కుక్ లేకపోవడంతో విద్యార్థినులకు సమయానికి భోజనం అందడం లేదు. తమ సమస్యకు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని విద్యార్థినీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో హెడ్ కుక్‌గా పనిచేసిన పుట్ట చిన్నమ్మ వయసు ఎక్కువగా ఉండడంతో తొలగించారు. ఈ ఏడాది జులై 5వ తేదీ నుంచి పోస్ట్ ఖాళీగా ఉండడంతో మిగతా ఇద్దరు అసిస్టెంట్లు సుమారు 100 మంది విద్యార్థినీలకు భోజనాన్ని అందిస్తున్నప్పటికీ ఆలస్యం అవుతున్న కారణంగా విద్యార్థినీలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో హెడ్ కుక్ పోస్టుపై జులైలోనే దరఖాస్తులు స్వీకరించారు. వెంటనే ఇంటర్వ్యూలు చేయాల్సి ఉండగా పలుమార్లు అనివార్య కారణాల వలన ఇంటర్వ్యూను రద్దు చేశారు. చివరకు నవంబర్ 23వ తేదీన ఎమ్మార్వో వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంఈఓ అశోక్ ఇంటర్వ్యూలు నిర్వహించగా.. ఆరుగురు మహిళలు హాజరయ్యారు. ఇంటర్వ్యూలు పూర్తయి 15 రోజులు కావస్తున్నా.. ఇప్పటివరకు భర్తీ చేయకపోవడంతో విద్యార్థినిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఎంఈఓ అశోక్‌ను నవతెలంగాణ వివరణ కోరగా మండల అధికారులు సర్వేలతో బిజీగా ఉన్నారని సమాధానం ఇచ్చారు. చిన్నపాటి హెడ్ కుక్ పోస్టును భర్తీ చేసేందుకు మండల అధికారులు మీనమేషాలు ఎందుకు లెక్కపెడుతున్నారో దీని వెనకాల రాజకీయ కారణాలు ఏమైనా ఉండవచ్చునని పలువురు అనుమానిస్తున్నారు. రాష్ట్రంలో వసతి గృహాల్లో ఆహారం వికటించి విద్యార్థినిలు అస్వస్థతకు గురవుతున్న ఘటనలు జరుగుతున్న సందర్భంగా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామనే భరోసాను తల్లిదండ్రులకు కల్పించేందుకు శనివారం తమ పిల్లలతో కలిసి హాస్టల్లోనే భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇటువంటి సమయంలో హెడ్ కుక్ లేకపోతే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి జిల్లా అధికారులు స్పందించి హెడ్ కుక్ పోస్టును భర్తీ చేయాలని విద్యార్థినీలు కోరుతున్నారు.



వారం క్రితం హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అంకిత్

లబ్దిదారుల సమాచారాన్ని పక్కాగా సేకరించాలి

- వివరాలు యాప్‌లో పొందుపరచాలి
- కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో లబ్దిదారుల సమాచారాన్ని పక్కాగా సేకరించి యాప్‌లో పొందుపరచాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల పూర్తి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అవసరమైన భూమి పత్రాలు, ఆహార భద్రత కార్డు, ఇంటి యజమానురాలు ఫొటోలను సేకరించాలని, తద్వారా యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. సర్వేకు ఒకరోజు ముందు ఆ గ్రామంలో చాటింపు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్‌రావు, తహసీల్దార్ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి, లబ్దిదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

ఈ నెల 15, 16 తేదీల్లో జరుగనున్న గ్రూప్ 2 పరీక్షలను పకడ్బందీగా, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రూట్ అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంతవరకు జరిగిన గ్రూప్స్ పరీక్షలను విజయవంతం చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం జరుగనున్న గ్రూప్ 2 పరీక్షలను జాగ్రత్తగా, ఎలాంటి సమస్యలకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థులను వేగవంతంగా నిశితంగా పరిశీలన చేసి పరీక్ష హాలులోకి పంపించాలని తెలిపారు. పరీక్షల నిర్వహణకు కేటాయించిన సిబ్బందిని వారి విధులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. శిక్షణ సమయంలో తెలిపిన వివరాలను క్షుణ్ణంగా తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.సి.ఓ డాక్టర్ విజయ్ కుమార్, అడిషనల్ ఆర్.సి.ఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలు చేయడం అభినందనీయం..

సమాజంలో సామాజిక సేవలు చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యం లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న 25 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోటరీ వరంగల్ సెంట్రల్ క్లబ్ రోటేరియన్ జూలూరు కృష్ణమూర్తి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా దృక్పథంతో రోటరీ క్లబ్ ద్వారా విద్య, వైద్యం, పర్యావరణం వంటి అంశాలలో సమాజ చేయడం జరుగుతున్నాయని కొనియా డారు. మున్ముందు రోటరీ క్లబ్ ద్వారా సమాజ సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి రాజు, రోటేరియన్ కోరే చంద్రమౌళి వరంగల్, జి.జ్ఞాన ప్రకాష్ అసిస్టెంట్ గవర్నర్, క్లబ్ కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సబ్బని కృష్ణ హరి, సీనియర్ రోటేరియన్ శ్రీశైలం, ప్రోగ్రాం చైర్మన్ పి.సత్యం, ధనుంజయ, బాలకిషన్, నాగభూషణం, డి.వి. వెంకటరాజం, భాస్కర్, జైపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, హెచ్.ఎన్.రెడ్డి, శంకర్, విద్యార్థినులు, తల్లిదం డ్రులు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

తప్పిదాలకు తావుండొద్దు

- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-ఆర్మూర్

తప్పిదాలకు తావులేకుండా వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన వారికి లబ్ది చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వేను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం పరిశీలించారు. మండలంలోని ఇస్సాపల్లి, పెర్కిట్‌లలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలన సందర్భంగా దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారుల వివరాలను సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, మొబైల్ యాప్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా దరఖాస్తుదారుల ఇండ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం కలిగి ఉన్నారా, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి యజమాని ఎవరు, పాత పెంకుటింట్లో ఉంటున్నారా లేక పక్కా గృహమా, నివేశన స్థలానికి సంబంధించి ఏమైనా ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా? తదితర అంశాలను పరిశీలిస్తూ మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేయించారు. ఒక్కో దరఖాస్తుదారుడి వివరాలను నమోదు చేసేందుకు ఎంత సమయం పడుతోంది, రోజుకు సగటున ఎన్ని కుటుంబాల వివరాలు నమోదు చేస్తున్నారు, సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ఇప్పటివరకు ఎంతమంది వివరాలను సేకరించారు, ఆన్లైన్లో ఎన్ని వివరాలను అప్లోడ్ చేశారని అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి, వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరిస్తూ ఆన్లైన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పురాతన, శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే, అలాంటి వారి వివరాలను కూడా సర్వే యాప్‌లో పొందుపర్చాలని అన్నారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వపరంగా లబ్ది చేకూరేందుకు వీలుగా వివరాల నమోదులో అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహసీల్దార్ గజానంద్, ఎంపీడీఓ తదితరులున్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కీటక జనిత వ్యాధుల నివారణపై జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ వైద్య సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. ముందుగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల పునరుత్పత్తికి రక్తం అవసరం కాబట్టి ఆడదోమలు మనుషుల రక్తం పీల్చుకుంటాయని, దీనివలన దోమ కాటుకు గురైన వారికి అనారోగ్యం సంభవిస్తుందని తెలిపారు. దోమల జాతులు సుమారు 400 వరకు ఉన్నాయని వివరించారు. వీటివల్ల డెంగ్యూ, చికెన్‌గున్యా, జికా, వెస్ట్‌నైల్ వైరస్, ఫైలేరియాసిస్, జపానీస్ బిఎన్ సేపాలిటీస్ లాంటి ప్రాణంతకమైన వ్యాధులు సంభవిస్తాయని ఆయన పేర్కొన్నారు. వీటి నివారణ పద్ధతులపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్, ఆరోగ్య బోధకుడు సలీం, ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపే రవీందర్, చింతల శ్రావణ్ కుమార్, పిహెచ్ఎన్ రాణి, సూపర్వైజర్ మాలంబి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజీపడితే ఇద్దరూ గెలిచినట్టే

- రేపు జాతీయ మెగా లోక్ అదాలత్
- కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎస్పి సింధు శర్మ



నవతెలంగాణ-కామారెడ్డి

రాజీమార్గమే.. రాజమార్గమని, చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని జిల్లా ఎస్పీ సింధు శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, చెక్‌బౌన్స్ కేసులో ఇతర రాజీ పడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని జిల్లా ప్రజలకు సూచించారు. రాజీమార్గం రాజమార్గమని వివరించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని, జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు, పోలీస్ సిబ్బంది రాజీపడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారం చేసుకోవచ్చని ఎస్పీ ప్రకటనలో తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-పిట్లం

ప్రజా పాలనలో భాగంగా అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తుందని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ వాడలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెనువెంటనే ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో భాగంగా మండల కేంద్రంలో 2385 ఇండ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నట్లు ఆమె వివరించారు. అందులో భాగంగా ఎస్సీ వాడలో 50 ఇండ్ల నిర్మాణ లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించినట్టు తెలిపారు. త్వరలో దరఖాస్తులన్నింటినీ పరిశీలించి అర్హులకు ఇండ్ల మంజూరుకు గానూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఎంపీఓ యాదగిరి, పంచాయతీ సెక్రటరీ బలరాం, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



విద్యుత్ కోతలు

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఆయా గ్రామాల్లో ఇష్టానుసారంగా విద్యుత్ కోతలు విధించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు జిరాక్సులు అవసరం కావాల్సి ఉండగా.. విద్యుత్ లేకపోవడం వల్ల తిరగాల్సి వస్తుందని ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్ 2 తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఉండాల్సిన అధికారులు లేకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని, గతంలో ప్రజా ప్రతినిధులు సైతం సదరు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ తీరు మారలేదని ఆరోపిస్తున్నారు. విద్యుత్ కోతలు తప్పనిసరైతే ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సిబ్బంది స్థానికంగా ఉండి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరతున్నారు.

స్టేడియం స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-గాంధారి

మండలంలో నిర్మించనున్న మినీ స్టేడియం ప్రతిపాదిత స్థలాన్ని కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ విక్టరీ, ఎల్లారెడ్డి ఆర్‌డిఓ మన్నే ప్రభాకర్ గురువారం సందర్శించారు. అనంతరం జువ్వాడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు వైద్యం చేస్తున్న వైద్యులు

కాచాపూర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కాచాపూర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, స్కానింగ్ మిషన్ ద్వారా పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ దేవేందర్, డాక్టర్ అనిల్‌రెడ్డి, డాక్టర్ రమేష్ రాథోడ్, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

నవతెలంగాణ-బోధన్

గ్రంథాలయాల అభివృద్ధికి తాను ఎప్పటికప్పుడు కృషి చేస్తానని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం మెరుగైన వసతులు కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. గ్రంథాలయాలను డిజిటల్ చేయడానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. గ్రంథాలయాలలో పోటీ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన పుస్తకాలు ఎంతోమంది విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శరత్ రెడ్డి, గ్రంథ పాలకులు శ్రావణ్, సందీప్, రమాదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, చిత్రాల ప్రమోద్, విష్ణు వర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ కబడ్డీ విజేత మోతే హై స్కూల్



నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

వేల్పూర్ మండలంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలలో కబడ్డీలో మండలంలోని మోతే గ్రామానికి చెందిన జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రథమ బహుమతిని పొందారు. విజేతలకు గురువారం క్రీడల ముగింపు సందర్భంగా ముఖ్య అతిథి ఎంపీడీవో బాలకిషన్ షీల్డులను, వ్యక్తిగత పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజేందర్, పిఆర్‌టియు వేల్పూర్ మండల ప్రధాన కార్యదర్శి సివి నరసింహారావు, మోతే ప్రధానోపాధ్యాయులు వైద్య గణేష్, వ్యాయామ ఉపాధ్యాయులు మంచిర్యాల సురేష్ కుమార్, దేవ సుకన్య, రాజేందర్, గంగారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు కాంతి హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన మల్లమారి ప్రశాంత్ కుమార్ కాంతి హైస్కూల్లో పీఈటిగా పనిచేస్తున్నాడు. నిన్న జిల్లా స్థాయి బేస్ బాల్ సీనియర్స్ సెలక్షన్ నిర్వహించగా చక్కని ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారు. ఈ ఎంపిక పట్ల కాంతి హైస్కూల్ కరస్పాండెంట్ వేల్పూర్ గంగారెడ్డి, జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగ మోహన్, జక్రాన్‌పల్లి సీనియర్ క్రీడాకారులు చిట్ల శ్యామ్, నాట్ల రంజిత్, రాజు బొంబాయి, మహేందర్, ఆర్మూర్ ప్రైవేట్ పిఈటి అందరూ ప్రశాంత్‌ను అభినందించారు.

మానవ హక్కుల వేదిక పదవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



మహాసభల కరపత్రాలు అవిష్కరిస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈనెల 14, 15 అనంతపురం పట్టణంలో జరిగే మానవ హక్కుల వేదిక పదవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి అని మానవ హక్కుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది గొర్రెపాటి మాధవరావు పిలుపునిచ్చారు. సహజ వనరులపై బహుజాతి సంస్థలకు కాకుండా ప్రజలకు, అడవిపై ఆదివాసీలకు హక్కు ఉండాలని డిమాండ్ చేస్తూ జరిగే మానవ హక్కుల వేదిక పదవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. నగరంలోని ఎల్లమ్మ గుట్ట నందు మానవ హక్కుల వేదిక నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదవ రాష్ట్ర మహాసభల కరపత్రాలను మానవ హక్కుల వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షులు గొర్రెపాటి మాధవరావు ఆవిష్కరించి ప్రసంగిస్తూ డిసెంబర్ 14న మానవ హక్కుల వేదిక సంస్థాగత మహాసభ ఉంటుందని, డిసెంబర్ 15న వివిధ అంశాలపై సెమినార్లు ఉంటాయని అన్నారు. కులగణన ఎందుకు అవసరం అనే అంశంపై ఎస్ఎం సాహు సామాజిక విశ్లేషకులు, బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు అనే అంశంపై మాలిని సుబ్రహ్మణ్యం స్వతంత్ర విలేకరి, ఎన్ఈపి 2020 కాషాయకరణ కార్పొరేటీకరణ అంశం పై వెంకటరమణమూర్తి చరిత్ర విశ్రాంత అధ్యాపకులు వివరిస్తారని తెలిపారు. ఆశ అంతమైతే సమస్త కోల్పోతాం అన్న పాలస్తీనా కవి మహమ్మద్ దర్విష్ పిలుపు కొనసాగింపుగా ఆశ నిశ్చయాలతో మానవ హక్కుల వేదిక తన కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందించుకోబోతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాల మీద అప్రకటిత నిర్బంధాన్ని కొనసాగిస్తున్నాయని, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. రాజ్యాంగాన్ని తిరిగి రచించాలన్న కుటిల ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని అందులో భాగంగానే లగిచర్ల తదితరులు ఘటనలు జరిగాయని ప్రజా ఉద్యమాలకు ప్రభుత్వాలు వెనకడుగు వేయాల్సిందేనని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంట్యాల రమేష్, జిల్లా కోశాధికారి ఆకుల సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు మీనా సహాని-అడ్వకేట్, జి.అన్వేష్-అడ్వకేట్, కృష్ణ గోపాలరావు-విశ్రాంత న్యాయమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో సంతోష్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల జాబితా తయారు చేసి ఈనెల 7న గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించినట్టు ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ తెలిపారు. దీనిపై మండల రాజకీయ పార్టీల అధ్యక్షులు, ప్రతినిధులతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుండి రమేష్, రాజు, సత్యనారాయణ, బీఆర్ఎస్ నుండి దోనకంటి నర్సయ్య, ఎంఎ మొయిజ్, గోవర్ధన్ సిపిఎం, లక్ష్మన్ గౌడ్, టీవీఎన్ రాజు-బీజేపీ పార్టీ, బాబురావ్ డీఎస్పీ పార్టీ, భీంరావ్ పర్యవేక్షకులు, ప్రిన్స్-సీనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

మహారాష్ట్ర స్టడీ టూర్‌కు జేఎం కెపిఎం రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు



మహారాష్ట్ర స్టడీ టూర్‌కు బయలుదేరిన సంఘం సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మనోహరాబాద్ గ్రామానికి చెందిన జేఎం కేపిఎం రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు గురువారం మహారాష్ట్ర స్టడీ టూర్‌కు బయలుదేరినట్లు రైతు ఉత్పత్తిదారుల సంఘం కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని ఇంగోలి దత్త గురు ఉత్పత్తిదారుల సంఘం, నాసిక్‌లోని సహాయాద్రి రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించడానికి మండలంలోని ఐదు గ్రామాల ఆదర్శ రైతులు వెళుతున్నట్టు తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని పడకల్, జక్రాన్‌పల్లి, కలిగోట్, మనోహరాబాద్, ధర్పల్లి మండలంలోని మైలారం ఆదర్శ రైతులు స్టడీ టూర్‌కు బయలుదేరి వెళ్లారు. స్టడీ టూరు బస్సును మండల వ్యవసాయ అధికారి దేవిక జెండా ఊపి ప్రారంభించారు.

ఎర్ర జొన్న పంటకు మోగిపురుగు నివారణ చర్యలు చేపట్టాలి

- మండల వ్యవసాయ అధికారి దేవిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పలు గ్రామాలలో ఎర్రజొన్న పంటకు మోగిపురుగు ఆశించిందని మండల వ్యవసాయ అధికారి గురువారం అన్నారు. మండలంలోని ముని పల్లి గ్రామంలో ఎర్ర జొన్న పంటను పరిశీలించగా అక్కడక్కడ పంటకు మోగిపురుగు ఆశించినట్టు తెలిపారు. నివారణకు క్లోరిన్ ఫైర్పాస్ లీటర్ కు 1.6 ఎమ్ ఎల్ పిచికారి చేయాలని సూచించారు.

క్షుణ్ణంగా పరిశీలించి
డేటాను కంప్యూటర్‌లో పొందుపరచాలి

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- కాకతీయ కళాశాలను ఆకస్మిక తనిఖీ

జిల్లా ఇంటర్ విద్య అధికారి



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్య అధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్, కార్యాలయ సిబ్బందితో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కార్యాలయ రిజిస్టర్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలు దొర్లిన విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తాయని, జాగ్రత్తగా ప్రతి అంశాన్ని క్రోడీకరించాలని అన్నారు. విద్యార్థుల డేటాను సరిచేసుకునేందుకు, సబ్జెక్టులు మార్చుకునేందుకు, ఫోటో, సంతకం తప్పిదం దొర్లితే సరిదిద్దుకోవడానికి ఇంటర్ బోర్డు మరో అవకాశం ఇచ్చిందని, క్షుణ్ణంగా పరిశీలించి డేటాను కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలను అతిక్రమించిన ఏ కళాశాలపై అయిన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కళాశాల ఆవరణతోపాటు, తరగతి గదులను, ప్రయోగశాలలు, కనీస అవసరాల కల్పనపై పర్యవేక్షణ చేశారు. నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ, పాలనాపరమైన అనుమతులు, పరీక్ష ఫీజుల వసూలు, ఇతర అన్ని రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. సమావేశంలో ప్రిన్సిపల్, సిబ్బంది, అధ్యాపకులు హాజరయ్యారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సూచించిన మేరకు ప్రణాళిక బద్ధంగా బోధన, నిర్వహణ జరగాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ కవిత బీసీల గురించి మాట్లాడడం హాస్యాస్పదం

- కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ బీసీలను విస్మరిస్తుందని కవిత మాట్లాడడం హాస్యాస్పదమని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలను వంచించిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని, పదేళ్ల పాలనలో రాజకీయంగా, ఆర్థికంగా రాష్ట్రంలో బీసీలు వెనుకబడి పోయారని అన్నారు. కేవలం కొంతమందికి బర్లు, గొర్రెలు, చేప పిల్లల పంపిణీ చేసి బీసీలను ఉద్ధరించామని ప్రగల్భాలు పలికారని దుయ్యబట్టారు. గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీలో కూడా విపరీతమైన అవినీతికి పాల్పడిన నీచ చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని ఆయన అన్నారు. బీసీ బందు ప్రకటిస్తామని చెప్పి బీసీలను మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని ఆయన తెలిపారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా ఎంతమందికి రుణాలు మంజూరు చేశారో కవిత సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే బీసీల అభ్యున్నతికోసం ప్రణాళికలు రచిస్తుందని, మంత్రివర్గంలో బీసీలకు పెద్దపీట వేయడంతో పాటు పార్టీ సంస్థాగత పదవులు బీసీలకు కట్టబెట్టిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం కుటుంబానికి, వర్గానికి చెందిన వారికి మాత్రమే పార్టీ పదవులు దక్కాయని ఆయన ధ్వజమెత్తారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా కులగణన చేసి బీసీల లెక్కలు బయటపెట్టి తద్వారా బీసీలకు రాజకీయ ఆర్థిక స్వావలంబన కల్పించడమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందడుగు వేసిందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మాత్రం సమగ్ర సర్వే నిర్వహించి బీసీల లెక్కలు బయట పెట్టలేదని ఆయన విమర్శించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కులగణన ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తుందని అలాగే కుల గణన ఆధారంగా బీసీలకు బడ్జెట్లో నిధులను కేటాయిస్తుందని ఆయన అన్నారు. త్వరలోనే రాష్ట్రంలో అన్ని వర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నారని, వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయడమే కాకుండా బీసీ విద్యార్థులకు నూతన సంక్షేమ హాస్టళ్ళ నిర్మాణం, బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన పెండింగ్ స్కాలర్షిప్లను విడుదల చేసే యోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. అనవసరంగా కవిత బీసీలపై కపట ప్రేమ నటించొద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో నగర యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ప్రీతం, దిగంబర్ పాల్గొన్నారు.

ఆటల్లోనూ ముందుండడం అభినందనీయం

- ఆలూర్ తహసీల్దార్ రమేష్



క్రీడాకారులకు బహుమతిని అందజేస్తున్న తహసీల్దార్ రమేష్

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు చదువుతోపాట ఆటల్లో ముందుండడం అభినందనీయమని ఆలూరు తహసీల్దార్ రమేష్ అన్నారు. మండల సీఎం కప్ టోర్నమెంట్ ముగింపు సమావేశంలో గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మూడు రోజుల నుంచి జరుగుతున్న సీఎం కప్ ముగింపు సమావేశం మండల విద్యా శాఖాధికారి నరేందర్ అధ్యక్షతన జరిగింది. మూడు రోజులుగా పాఠశాల నందు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, పాఠశాల పిడి, సీఎం కప్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో మండల విద్యాధికారి మాట్లాడుతూ మూడు రోజులుగా సీఎం కప్ క్రీడల్లో పాల్గొని గెలుపొందిన వారికి అభినందనలు తెలిపారు. ఓడిపోయినవారు భవిష్యత్తులో మరింత ప్రతిభ చూపెట్టాలని అన్నారు. మండల స్థాయిలో సెలక్షన్ అయిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో కూడా మంచి ప్రతిభ చూపాలని అన్నారు. క్రీడలు సక్సెస్ కావడానికి ఆర్మూర్ మండల ఎంపీడీవో, ఆలూరు విలేజ్ సెక్రెటరీ రాజలింగం సహాయ సహకారాలు అందించారని అన్నారు. టోర్నమెంట్‌కు ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వ్యవహరించిన పిడి రాజేష్‌ను అభినందించారు. పీడీ, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో ఆలూర్ మండల పిడి లు సురేందర్ సుజాత, కవిత రజిని, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు . వీడీసీ సభ్యులు బార్ల ముత్యం క్యాషియర్ గంగారెడ్డి, సుమన్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.



రాష్ట్ర బేస్ బాల్ పోటీలకు
జడ్పిహెచ్‌ఎస్ తొర్లికొండ విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 11న జడ్పిహెచ్‌ఎస్ బాయ్స్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన సీనియర్ బేస్ బాల్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థులు దేవుడు నాగరాజు, కళ్లెం నరసింహ పాల్గొని చక్కని ప్రతిభ కనబరిచారు. ఈనెల 13 నుండి 15 వరకు ఎన్టీఆర్ స్టేడియం మహబూబాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర సీనియర్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం.శ్రీనివాస్ రాష్ట్ర సీనియర్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైన దేవుడు నాగరాజు, కళ్లెం నరసింహలను అభినందించారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎంపిక కావడంపట్ల ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు.

మిగతా విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకొని నచ్చిన క్రీడలో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, ఉపాధ్యాయులు గంగాధర్, డాక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

కూతురు జ్ఞాపకార్థం ఫ్రీజర్ వితరణ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని (తానకుర్దు)తాడేం గ్రామానికి చెందిన కుచన్‌పల్లి రఘుపతి రెడ్డి - విజయ కూతురు ప్రజ్ఞ రెడ్డి ఇటీవలే మరణించింది. అయితే గురువారం (పెద్దకర్మ) 11వ రోజు కార్యక్రమంలో తన కూతురు జ్ఞాపకర్ధంగా ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో రఘుపతి రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు అనంతరెడ్డి, సూర్యరెడ్డి, నాగార్జున, జలంధర్ రెడ్డి, బుజెందర్, పాపయ్య సాయిబాబా, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఫ్రీజర్ అందజేసిన కుటుంబీకులు

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్
- ఐడీఓసీలో ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాలను అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. జిల్లా విద్య, వైద్యారోగ్య, పౌర సరఫరాలు, సహకార, పరిశ్రమలు తదితర శాఖల కార్యాలయాలను సందర్శించి అధికారులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలతో సామరస్యంగా వ్యవహరిస్తూ, సంతృప్తికరంగా సేవలు అందించాలని హితవు పలికారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్, ఆయా శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- మానసిక ఆరోగ్య అవగాహన సదస్సు, కంటి అద్దాల పంపిణీ



విద్యార్థులకు కంటి అద్దాలు అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సులువైన పద్ధతుల ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చని, క్రమశిక్షణతో వాటిని అభ్యసించడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రవితేజ అన్నారు. గురువారం సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలతో రిలాక్షేషన్ ఎక్సర్‌సైజ్‌లను చేయించారు. వ్యక్తిగత, శారీరక ఆరోగ్యానికి సంబంధించి సులువుగా అర్థం చేసుకుని గుర్తు పెట్టుకునేలా జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ స్వామి సులోచన విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియజేశారు. విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలని తెలియజేశారు. సూర్య ఆరోగ్య సంస్థ వారు పిల్లలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ సూర్య ఆరోగ్య సంస్థ చేస్తున్న ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో సూర్య ఆరోగ్య సంస్థ ముఖ్య కార్య నిర్వహణ అధికారి రాజేంద్ర కుమార్ విక్రమ్, వినోద్ కుమార్,రజిత, పాఠశాల ఉపాధ్యాయులు ఆనంద్, శ్రీరాం నాయక్, ఇతర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

90రోజులు విద్యపై దృష్టి సారిస్తే విజయం మీదే

- ప్రిన్సిపల్ టి శ్రీనాథ్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ టి.శ్రీనాథ్

నవతెలంగాణ-ధర్పల్లి

ఇంటర్ విద్యార్థులకు రానున్నది పరీక్షల సమయం అందుకే 90 రోజులు చాలా శ్రద్ధగా చదువుపై దృష్టి సారించినట్లయితే విజయం మీవేంటే అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి. శ్రీనాథ్ అన్నారు. గురువారం ఆయన ఇంటర్ విద్యార్థుల తల్లి తండ్రులతో మండలకేంద్రంలోని కళాశాలలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. వివిధ పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం వివరాలను, హాజరు శాతం వివరాలను, అదేవిధంగా రాబోయే పరీక్షలను సమర్ధవంతంగా ఎదుర్కొనే విధంగా తయారు చేసిన 90 రోజుల ప్రణాళికను వివరించారు. క్రమం తప్పకుండా విద్యార్థులు హాజరు అయ్యే విధంగా చూడాలని ప్రిన్సిపల్ తల్లిదండ్రులను కోరారు. ఇంటర్ విద్యార్థులకు ఇది కీలక సమయమని, చదువుపై శ్రద్ధ వహించే విధంగా తమతో పాటు తల్లి తండ్రులు వారికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ సురేష్ బాబు, స్టూడెంట్ కౌన్సిలర్స్, హరిత, లాబిశెట్టి, మహేష్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు గురువారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ఆదేశానుసారం ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ మండలాధ్యక్షుడు ఇమామ్, ఎల్లారెడ్డి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గులాము హుస్సేన్, సుధాకర్, మసూద్, కలీం, ఫారూఖ్ సాఫ్ట్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం



క్రీడల్లో పాల్గొన్న వికలాంగ విద్యార్థులు

నవతెలంగాణ-తాడ్వాయి

వికలాంగ విద్యార్థులకు భవిత సెంటర్ల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని డీఈఓ రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రపంచ వికలాంగ దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. వారికి అవసరమైన కృత్రిమ అవయవాలు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అందజేస్తున్నామన్నారు. వికలాంగ విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వేణు శర్మ, కృష్ణ చైతన్య, విద్యాశాఖ అధికారి రామస్వామి, రమేష్, అంబదాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలకు..

- సూచించిన పలువురు
- ముగిసిన సీఎం కప్ క్రీడలు
- గెలుపొందిన వారికి బహుమతులు అందజేత



గాంధారి : విద్యార్థులకు బహుమతిని అందజేస్తున్న అధికారులు



తాడ్వాయిలో..



నాగిరెడ్డిపేట్‌లో..

ఓ.ఓ.ఓ.క్రీడలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని పలువురు వక్తలు సూచించారు. గ్రామాల్లో నిర్వహించిన సీఎం కప్ క్రీడలు ముగియడంతో ఆ క్రీడల్లో గెలుపొందిన వారికి గురువారం బహుమతులు అందజేశారు.

గాంధారి : క్రీడల ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేశ్వర అన్నారు. గురువారం ముఖ్యమంత్రి కప్ క్రీడలు ముగి శాయి. ఈ నెల 10 తేదీ నుంచి 12 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెట్‌సంగం క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించినట్టు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. కబడ్డి, వాలీ బాల్, ఖోఖో పురుషులు విభాగంలో 16 జట్లు భాగస్వామ్యం కాగా, బాలికల విభాగంలో 8జట్లు పాల్గొ న్నాయి. గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేశ్వర మాట్లాడారు. విద్యాశాఖ అధికారి శ్రీహరి, ప్రధానోపా ధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెలుపొందిన జట్లు ఇవే..

వాలీబాల్ బాలుర విభాగంలో సోమరతండ మొదటి స్థానం, నెరల్ గ్రామ ద్వితీయ బహుమతి, వాలీబాల్ బాలికల విభాగంలో గుడివెనక తండ మొదటి స్థానం, పెట్‌సంగం ద్వితీయ స్థానం, కబడ్డి పురుషుల విభాగంలో నేరల్ ప్రథమ, గౌరరం ద్వితీయ, మహిళల విభాగంలో చద్మల్ ప్రథమ, గుడి వెనకతండ ద్వితీయ, ఖోఖో పురుషుల విభాగంలో భీర్మల్ తండ ప్రథమ, చద్మల్ తండ ద్వితీయ, మహిళల విభాగంలో ప్రథమ గుడివెనక తండ, మతుసంగం ద్వితీయ బహుమతి సాధించారు. అద్భుత క్రీడా ప్రదర్శన చేసిన ప్రతి జట్టు నుంచి క్రీడా కారులకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు.

తాడ్వాయి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న సీఎం క్రీడలు గురువారం ముగిసినట్టు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, కోకోతో పాటు అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించిన పాఠశాలల జట్లకు సర్టిఫికెట్లతో పాటు బహుమతులు మండల ప్రత్యేకాధికారి రాజారామ్ చేతుల మీదుగా అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సవితరెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో గత మూడు రోజుల నుంచి నిర్వహించిన సీఎం కప్ క్రీడలు గురువారం నాటికి ముగిశాయి. విజేతలకు ఎంపీడీవో ప్రభాకర్ చారి బహుమతులను ప్రదానం చేశారు. క్రీడలలో మొత్తం 54 జట్లు పాల్గొన్నట్టు ఆయన పేర్కొన్నారు. నెట్‌బాల్ గర్ల్స్ ఫస్ట్ ప్రైజ్ గోలి లింగాల్, సెకండ్ ప్రైజ్ చీనూర్, నెట్ బాల్ బాయ్స్ ఫస్ట్ ప్రైజ్ ధర్మారెడ్డి, సెకండ్ ప్రైజ్ నాగిరెడ్డిపేట్, కబడ్డీ గర్ల్స్ ఫస్ట్ ప్రైజ్ బొల్లారం, సెకండ్ ప్రైజ్ ఆత్మకూర్, కబడ్డీ బాయ్స్ బొల్లారం ఫస్ట్ ప్రైజ్, సెకండ్ ప్రైజ్ గోలి లింగాల్, కోకో గర్ల్స్ ఫస్ట్ ప్రైజ్ బొల్లారం, సెకండ్ ప్రైజ్ నాగిరెడ్డిపేట్, కోకో బాయ్స్ ఫస్ట్ ప్రైజ్ బొల్లారం, సెకండ్ ప్రైజ్ నాగిరెడ్డిపేట్, వాలీబాల్ ఫస్ట్ ప్రైజ్ గర్ల్స్ బొల్లారం, సెకండ్ ప్రైజ్ మాల్‌తుమ్మెద, వాలీబాల్ బాయ్స్ ఫస్ట్ ప్రైజ్ గోపాల్పేట్, సెకండ్ ప్రైజ్ ఆత్మకూర్‌కు చెందిన విద్యార్థులు బహుమతులు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతల కోసం సీఎం కప్ ఎంతో ఉపయోగపడుతాయని ఎంపీడీఓ సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్సై రంజిత్‌తో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. ఆటలతో శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారని విద్యార్థులకు సూచించారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్-2024 టోర్నమెంట్ నిర్వహించినట్టు తెలిపారు. పంచాయతీల నుంచి వచ్చిన క్రీడాకారులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి యోసేఫ్, వ్యయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెం పోటీల్లో మండల క్రీడాకారుని ప్రతిభ



నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన యూనివర్సిటీ క్రీడా పోటీలలో మండల కేంద్రానికి చెందిన భరత్ ఎనిమిది వందల మీటర్ల పరుగు పందెంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన భరత్‌ను మండల క్రీడాకారులు, రాజకీయ నాయకులు అభినందించారు. భవిష్యత్తులో జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

మొరం రోడ్డు పనులు ప్రారంభం



మొరం పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని అమ్దాపూర్ గ్రామ సమీపంలోని మత్తడి పోశవ్వ ఆలయం సమీపంలో నుంచి పెద్దవాగు వరకు మొరం రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గంగాశంకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు, రైతుల సౌకర్యార్థం ఈ మొరం రోడ్డు పనులు చేపట్టినట్టు తెలిపారు. ఎస్ఆర్ఈజీఎస్ ద్వారా ఈ పనులు చేపడుతున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు సంజీవ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ వసంత్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మెన్ పోరెడ్డి గంగాధర్, డీసీసీ జనరల్ సెక్రటరీ పల్లెన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు జే.రాజు, ప్రభాకర్, రత్నాకర్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల ఓటరు జాబితాపై సమావేశం



దోమకొండ : సమావేశంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ/సదాశివనగర్

గ్రామ పంచాయతీల 2024 ఎన్నికల కోసం గ్రామాల వారీగా పోలింగ్ స్టేషన్‌లకు సంబంధించిన ఓటరు జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదని ఎంపిడివో ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాపై ఆయా రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాను ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో నోటీసు బోర్డులపై ఈ నెల 7 నుంచి పోలింగ్ స్టేషన్‌లో జాబితాను ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాజకీయ పార్టీల నాయకులు అనంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, బీజేపీ పార్టీ నాయకులు భూపాల్‌రెడ్డి, కంది మనోజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బొమ్మెర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో సమావేశం

సదాశివనగర్ : గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ ముసాయిదా జాబితా గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. అభ్యంతరాలుంటే శుక్రవారం తెలపాలని, ఫైనల్ పబ్లికేషన్ 17వ తేదీన చేయనున్నట్టు వివరించారు.

16న చలో బిచ్కుంద

- మున్నూరు కాపు మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 16న బిచ్కుంద మండల కేంద్రంలోని బండయప్ప ఫంక్షన్ హాల్‌లో జుక్కల్ నియోజకవర్గం మున్నూరు కాపు మహాసభ పోస్టర్లను మద్నూర్ మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో బిచ్కుంద, మద్నూర్ మున్నూరు కాపు సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్నూరు కాపు నియోజకవర్గం స్థాయి మహాసభ విజయవంతానికి మద్నూర్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో మున్నూరు కాపులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో నాయకులు నాల్చర్ రాజు, సోపాన్‌రావు, నాల్చారు శ్రీనివాస్, వినోద్, అశోక్, స్వామి, మద్నూర్ మండల మున్నూరు కాపు సంఘం నాయకులు డాక్టర్ బండివార్ విజయ్, పాకల్‌వార్ విజయ్, కర్ల సాయిలు, సందూర్‌వార్ హనుమాన్లు, తైదల్ చందర్, తూమ్ గంగాధర్, తూమ్ రాములు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిల్లు పంపిణీ



పంపిణీ చేసిన సైకిళ్లతో విద్యార్థినీలు

నవతెలంగాణ-సదాశివనగర్

బాలికా సాధికారత కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలికలకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ జూకంటి బాపురెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర సహ అధ్యక్షులు సహాయ సహకారాలతో సైకిళ్లు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా విద్యాధికారి రాజు బాలికలకు గురువారం అందజేశారు. మండలంలోని ఉత్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 6, పద్మాజివాడీ ఉన్నత పాఠశాలకు 4 సైకిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీ రాజ నరసింహారెడ్డి, సెక్రెటరీ సత్యనారాయణ, ట్రెజరర్ కృష్ణహరి, కోరే చంద్రమౌళి, గట్టు జ్ఞాన ప్రకాష్, శ్రీశైలం, పొలబాయిన సత్యం, జైపాల్‌రెడ్డి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలతో అభివృద్ధి చెందాలి



యూనిట్‌లను ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్

నవతెలంగాణ-భిక్కనూర్

మహిళా సమైక్య సభ్యులు బ్యాంకు లింకేజీ ద్వారా అందజేసే సబ్సిడీ రుణాలతో వ్యాపారాలు ప్రారంభించి ఆర్థిక అభివృద్ధి సాధించాలని మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని సిద్ధిరామేశ్వర్‌నగర్ గ్రామంలో ఆదిలక్ష్మి సభ్యురాలు పిఎమ్ఎఫ్ఎమ్ఈ యూనిట్ కింద పిండి గిర్ని, మిక్సర్ గ్రైండర్ యూనిట్‌లను బ్యాంక్ మేనేజర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ నితిన్ కుమార్, డిపిఎం వకుళ, ఏపీఎం రాజేందర్, శ్రీనివాస్, సీసీ స్వాతి ముత్యం, వివోఏ శైలజ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య అవగాహనా సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అనే అంశంపై సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో నీలా జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు గురువారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శారీరక ఆరోగ్యంపై సులువుగా అవగాహన చేసుకునే విధంగా గుర్తు పెట్టుకునేలా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ స్వామి సులోచన వివరించారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహించి కంటిలోపమున్నవారికి కండ్ల అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవితేజ, ముఖ్య కార్యనిర్వాహణాధికారి రాజేందర్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ.శంకర్, ఉపాధ్యాయులు ఆనంద్, ఖదీర్, శ్రీరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రారంభం





నాగిరెడ్డిపేట్ : వివరాలు సేకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నాగిరెడ్డిపేట్ : మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఇందిరమ్మ సర్వే ప్రారంభ మైనట్లు ఎంపీడీవో ప్రభాకర్ చారి తెలిపారు. గురువారం మాసంపల్లి, తాండూర్ గ్రామాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వేను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, కారోబార్ నరసింహులున్నారు.

జుక్కల్ : మండలంలోని లాడేగావ్ గ్రామంలో ఎంపీడీవో శ్రీనివాస్ ఇంటింటికి తిరుగుతూ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను గుర్తించేందుకు గానూ సర్వే చేపట్టారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించు కున్న వారు కూడా దరఖాస్తులు చేసుకోవడంతో లబ్ధిదారులను గుర్తించడానికి పకడ్బందీగా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదికలను ఇవ్వాలని కోరడంతో అధికారులు గ్రామాలకు వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జీపి సెక్రెటరీ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండలంలోని తడిహిప్పర్గ గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో రాణి, మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్య లబ్ధిదారుల ఎంపిక సర్వేలను పరిశీలించారు. ఈ సర్వే కార్యక్రమం గ్రామ కార్యదర్శి హౌసింగ్ ఏఈ కొనసాగిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లబ్ధిదారుల ఎంపికలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, ఇంటి పన్ను, బిల్లు, పట్టా పాస్ పుస్తకం, భూమి యజమాన్య పత్రం పొజిషన్ సర్టిఫికెట్ వీటిని లబ్ధిదారులు తప్పకుండా చూపించాలని అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్టు ఇందిరమ్మ ఇళ్ల సర్వేల అధికారులు లబ్ధిదారులకు సూచిస్తున్నారు.

తాడ్వాయి : మండలంలో ఇందిరమ్మ లబ్ధిదారుల సర్వే రెండో రోజు చేపట్టినట్టు ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. కృష్ణాజీవాడీ దళిత కాలనీలో ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి రేకుల షెడ్ల నివాస కుటుంబాల సర్వే చేసినట్లు ఆయన వివరించారు. ఈ సర్వేలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, మండల పంచాయతీ అధికారి శ్వేతారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-బోధన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరుతూ గురువారం బోధన్ పట్టణంలో పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల గ్రౌండ్ నుంచి అనిల్ టాకీస్ చౌరస్తా వరకు విద్యార్థులు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు గౌతమ్ కుమార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగస్తులందరి పాత్ర విద్యా శాఖలో కీలకమైనదని తెలిపారు. గత 18 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలలో కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం వీరిపై నిర్లక్ష్య ధోరణి చూపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్, జిల్లా నాయకులు సాయినాథ్, ఆకాష్ కుమార్, శ్రీకాంత్, భీమ్‌రావు, సుధాకర్, వనజ, ప్రియా, రమణితో పాటు సుమారు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్

నవతెలంగాణ-కామారెడ్డి

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్ అన్నారు. గురువారం బిబిపేట్ మండలంలో ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి, జనగామ గ్రామాల్లో భారత రాజ్యాంగ ప్రచార ఉద్యమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రాజ్యాంగ ఉత్సవాల్లో భాగంగా ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి, జనగామ గ్రామంలో నిర్వహించిన భారత రాజ్యాంగ ప్రచార ఉద్యమాన్ని జనవరి 26 వరకు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు భారత రాజ్యాంగం పట్ల వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రాజబాబు, జాన్‌శంకర్, లక్ష్మణ్, సంఘాల నాయకులు లింగం, సాయిలు, నరేష్, ప్రసాద్ బాబు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- మల్లూరు తాండ మాజీ ఉపసర్పంచ్ తల్లిదండ్రులు మృతి
- సంగారెడ్డి జిల్లా కల్హేర్ వద్ద ఘటన



మృతిచెందిన భార్యభర్తలు (ఫైల్)

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూరు తాండ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ గోపాల్ తల్లిదండ్రులు ఇస్లావత్ సంగే నాయక్ (50), లక్ష్మీబాయి (45) మృతిచెందారు. వీరిద్దరూ తమ ద్విచక్ర వాహనంపై కూతురు దగ్గరకు వెళ్లే క్రమంలో సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం దాటాక ఇంద్రానగర్ సమీపంలో మహీంద్రా తార్ వాహనం ఢీకొనడంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్హేర్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కూతురు దగ్గరికు వెళ్తున్న భార్యభర్తలు రోడ్డు ప్రమాదంలో చనిపోయేసరికి తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉండగా.. బైక్‌ను ఢీకొన్న తార్ వాహనం కల్హేర్ మండలం కిష్టాపూర్ మాజీ సర్పంచ్‌దని స్థానికులు పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన యువకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామ సమీపంలో గల రైస్‌మిల్ దగ్గర బుధవారం అర్ధరాత్రి రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి వారిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు వ్యక్తులకు కాళ్లు విరిగాయి. గ్రామస్తుల సమాచారం ప్రకారం.. కందకుర్తి నుంచి నిజామాబాద్ వైపు వెళున్న కృష్ణ అనే వ్యక్తి మద్యం మత్తులో పెయింటింగ్ పని పూర్తి చేసుకుని నిజామాబాద్ నుంచి వీరన్నగుట్ట వైపు వెళ్తున్న సంతోష్‌ను ఢీకొట్టారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు 108 సిబ్బంది సంజీవ్‌గౌడ్, పైలెట్ నాగరాజు పేర్కొన్నారు.

బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయునికి సన్మానం



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని ఎస్సి కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వర్తించి ఇటీవలే మచ్చర్ల పాఠశాలకు బదిలీపై వెళ్ళిన కొండూరు సుధాకర్‌ను ఏర్గట్ల పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయన పాఠశాలకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరుణ్, ప్రవణ, పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు ఆట వస్తువుల పంపిణీ

నవతెలంగాణ- ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాతపురం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని వడ్డెర కాలనీ లో గల అంగన్వాడి పాఠశాలలో చిన్న పిల్లలకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్, కార్యదర్శి మ్యాక శ్రీకాంత్, సభ్యులు అంబల్ల తిరుపతి, విజయానంద్, జ్ఞాని చావ్లా, బైరి శ్రీధర్, శశిధర్ రెడ్డి, టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.



చిన్నారులకు ఆట వస్తువులను అందజేత

టీ కప్పులతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

ఆరోరోజుకు సమ్మె

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలో ధర్నా చౌక్‌లో ఆరోరోజు సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని టీ కప్పులతో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని సమగ్ర శిక్షలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొన్నారు. తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళేందుకు వినూత్నమైన నిరసన తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్ 13న వరంగల్‌లోని సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షా శిబిరంలో చాయ్ తాగే లోపు జీవో ఇవ్వచ్చు అని వాఖ్యానించిన ముఖ్యమంత్రి ఇప్పటివరకు మాటపై నిలబడటం లేదని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం కే.రాజు మాట్లాడుతూ.. తక్షణమే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు విజయ్, కోశాధికారి ప్రసాద్, అంజయ్య, రమేష్, రాజన్న, ప్రభురవికిరణ్, రవిగౌడ్, అంబదాస్ రావు, భూపేందర్, యూసుఫ్ అలీ, అంబదాస్ రావు, తదితరులు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి. సమగ్ర శిక్ష ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు కల్పించాలి. పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లకు 12 నెలల వేతనం ఇవ్వాలని, ప్రతి సమగ్ర శిక్ష ఉద్యోగికి 10 లక్షల ప్రమాదబీమా, 5 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని అన్నారు. 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బేనిఫిట్ గా 20 లక్షలు చెల్లించాలన్నారు.



సమ్మె నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సిపిఐ, ఏఐటియుసి మద్దతు

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో ఐదురోజులుగా సమ్మె నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన దీక్ష శిబిరాన్ని సిపిఐ, ఏఐటియుసి బృందం నాయకులు పి.సుధాకర్, వై.ఓమయ్య, సఖి సురేష్, ఇమ్రాన్ అలీ, అమర్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య మాట్లాడుతూ.. విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులను విలీనం చేసి వీరి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు. గత ప్రభుత్వం వీరి సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఇప్పటికైనా ప్రజాపాలన ముఖ్యమంత్రి స్పందించి వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు టిపిటిఎఫ్ మద్దతు

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు టిపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. ఎస్ ఎస్ఏ ఉద్యోగులకు ముఖ్యమంత్రి హామీ మేరకు మినిమం టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఉద్యోగ భద్రతనుకల్పించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, సిఆర్పి, ఎంఐఎస్ కోర్డినేటర్‌లకు ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సౌకర్యాలు ఇవ్వాలని, సెలవులు మంజూరు చేయాలని జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్ తెలిపారు.

బాపూజీ వచనాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

బాపూజీ వచనాలయాన్ని డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దుతామని అధ్యక్షుడు భక్తవత్సలం అన్నారు. నగరంలోని బాపూజీ వచనాలయంలో గురువారం ఎన్నికల అధికారి ఎంఎస్ ఆచార్య నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భక్తవత్సలం మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు వేదికగా బాపూజీ వచనాలయాన్ని డిజిటల్‌గా మారుస్తామన్నారు. విద్యార్థులకు అందుబాటులో అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి పులి జైపాల్, నారాయణ, కార్యదర్శి మీసాల సుధాకర్‌రావు, కోశాధికారి గంగాధర్‌రావు, ఉపాధ్యక్షులు భవంతి దేవిదాస్, బోగ అశోక్, సంయుక్త కార్యదర్శులు సాంబయ్య, దత్తాద్రి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విజేత జట్లకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండల కేంద్రంలో మూడు రోజులపాటు జరిగిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేసినట్లు మండల క్రీడల కన్వీనర్, ఎంపీడీవో బాలకిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేందర్ తెలిపారు. గురువారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో సీఎం కప్ మండల క్రీడల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్ క్రీడల్లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విజేతలకు బహుమతులను అందించినట్లు తెలిపారు. ఆయా క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు ఈనెల 16 నుండి 21 వరకు జిల్లా స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ రవి, కార్యాలయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, సురేష్, రాజేశ్వర్, గంగారెడ్డి, దేవ సుకన్య, శరత్, సందీప్, మోతే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్, పిఆర్టీయూ మండల కార్యదర్శి నర్సింగ్ రావు పాల్గొన్నారు.

రెండు సంవత్సరాలుగా సేవ

నవతెలంగాణ-తాడ్వాయి

గత రెండు సంవత్సరాల నుంచి మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమానికి సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ఆశ్రమ భక్తులు నర్సింలు తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో జరిగే శబరిమత ఉత్సవాలకు సేవకార్యక్రమాలు చేయడానికి రుకుమ్ భాయ్, గంగామణి, మణెమ్మ, లక్ష్మీబాయి తదితరులు వచ్చినట్టు భక్తులు జీ.నర్సింలు, దశరథ్‌లు తెలిపారు.

అక్రమ ఇసుక డంప్ స్వాధీనం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని రెండవ బ్రిడ్జ్ నుంచి ఇసుక క్వారీకి వెళ్లే దారిలో అక్రమంగా 20 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసి ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్నామని తహసీల్దార్ జె.మల్లయ్య గురువారం తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను, ఇండ్లు కట్టుకునే వారుగాని, ప్రభుత్వ పనులు చేసేవారికి గాని డిడి కడితే వారికి వేబిల్లులు ఇచ్చి అనుమతి ఇస్తామని తెలిపారు. ఇసుక అవసరం ఉన్నవారు డిడిలు కట్టాలని సూచించారు.

ఓటు వేయడానికి సౌకర్యం కల్పించాలి

- బహుజన సమాజ్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు



ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి

తండాలలో గల ప్రజలకు గ్రామపంచాయతీలలోని ఓటు వేసే సౌకర్యం కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్ గురువారం మాచారెడ్డి ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాచారెడ్డి మండలం ఎంపీడీవో గోపి బాబుకు రాబోయే పంచాయతీ ఎన్నికల ప్రజలు ఓట్లు వేయడానికి మర్రి తండ గ్రామపంచాయతీ, నెమలిగుట్ట తాండ గ్రామపంచాయతీ, సర్దాపూర్ తాండ గ్రామపంచాయతీ, వెనుక తాండ గ్రామపంచాయతీ, బోడగుట్ట తాండ గ్రామపంచాయతీలలో ప్రభుత్వ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, స్కూల్స్, అంగన్వాడి కేంద్రాలు లేవని, ఆ తండాలకు దగ్గరున్న గ్రామపంచాయతీలలో ఓట్లు వేయడానికి వెళ్లాలన్న దాదాపు 2.5 కిలోమీటర్ నుంచి 3 కిలోమీటర్ దూరంలో ఉన్నాయని, ప్రజలందరూ అంత దూరం వెళ్లి ఓట్లు వేయడానికి ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రజలందరికీ ఆయా తాండ గ్రామపంచాయతీలలోనే ఓటు వేయడానికి సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ వాలీబాల్ పోటీలను ప్రారంభించిన వైస్ ఛాన్సలర్..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

క్రీడాకారుల ప్రతిభను గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడం తెలంగాణ యూనివర్సిటీ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు పేర్కొన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ వాలీబాల్ మెన్, ఉమెన్ చాంపియన్షిప్ 2024 పోటీలను యూనివర్శిటీ ప్లే గ్రౌండ్ లో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేయాలనే సంకల్పంతో ఉందని తెలిపారు. అందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుందని హామీ ఇచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్. ఎం యాదగిరి మాట్లాడుతూ విద్యతో పాటు సమాంతరంగా క్రీడలు ఎల్లవేళలా నిర్వహించాలని ఆటల వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని వివరించారు. విద్యార్థులు ప్రతిరోజు గేమ్స్ ప్రాక్టీసు చేసి యూనివర్సిటీ కి గుర్తింపు తేవాలని సూచించారు. ఈ టోర్నమెంట్ లో ఉమ్మడి జిల్లాల్లోని 13 కళాశాలల నుండి పురుషులు, 11 కళాశాల నుండి మహిళ క్రీడాకారినులు సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. వాలీబాల్ పురుషుల విన్నర్స్‌గా తెలంగాణయూనివర్సిటీ, రన్నర్స్‌గా గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నిజామాబాద్ నిలిచింది. మహిళల విభాగంలో విన్నర్స్‌గా జిజి కాలేజ్ నిజామాబాద్ కైవసం చేసుకోగా రన్నర్స్‌గా టీజీ డబ్ల్యూ ఆర్‌డిసి ఆర్మూరు నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్ డైరెక్టర్ డాక్టర్ జి బాలకృష్ణ ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్ ఆర్గనైసింగ్ సెక్రటరీ డాక్టర్ బి ఆర్ నేత , మరియు ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్. బాలమని, రమ రూప, అంజలి, అనిల్ కుమార్ క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైస్ ఛాన్సలర్

విద్యార్థులకు మానసిక సామర్థ్యాలపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-కామారెడ్డి

చదువుపై శ్రద్ధను పెంచే మైండ్ అప్ డేట్ టెక్నిక్స్‌ను ప్రయోగాత్మకంగా ప్రాక్టీస్ చేయలో మానసిక వైజ్ఞానిక ప్రదర్శనలో మైండ్ పవర్ స్పెషలిస్ట్ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఏకరీం వివరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాబాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు మనోవైజ్ఞానిక అవగాహన సదస్సు సీక్రెట్స్ ఆఫ్ మైండ్ పవర్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలలో మానసిక సంకల్ప సామర్థ్యాలను గుర్తించి వారిని సానుకూలంగా ప్రేరేపిస్తే వారిలో ఏకాగ్రత జ్ఞాపకశక్తి పదునెక్కుతాయని తెలిపారు. చదువులో అభ్యసన వైకల్యాలు రాకుండా ఉండాలంటే వారి మనసుని మెప్పించే విధంగా వినోదంతో పాటు విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలకు కేవలం చదువు చదువు అంటూ మానసికంగా వేధించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలను స్మార్ట్ ఫోన్‌లకు దూరంగా ఉంచాలని, చదువు పట్ల ఆశావహంగా ఆలోచించే విధంగా వినోదంతో కూడిన అంశాలతో చదువుపై శ్రద్ధను పెంచాలన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యలకు 040-35717915, 9440488571 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక లయోలా హైస్కూల్ ఎండి అజ్గర్, శ్లోకా స్కూల్ నిర్వాహకులు శంకర్, చైతన్య విద్యానికేతన్ ఆనంద్ రావు, దిలీప్, రోజ్ వుడ్స్ ఛంపైన్స్ హై స్కూల్ నుంచి సుహాసిని, వివిధ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న పలువురు

ఆర్‌టిఓ కార్యాలయాన్ని సందర్శించిన

కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహనపై విద్యా కార్యక్రమంలో భాగంగా ఆర్టీఓ యూనిట్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. పర్యటన సందర్భంగా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని అన్నారు. ట్రాఫిక్ నియమాలు, వాహన భద్రతా ప్రమాణాలు, రహదారి భద్రతా చర్యల యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ మిన్‌హాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సెషన్‌లో చురుకుగా పాల్గొన్నారు. దీనివల్ల యువతరంలో రహదారి భద్రత గురించి బాధ్యత, అవగాహనను కలిగించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వారు భద్రతా నిబంధనల గురించి తెలుసుకోవడానికి ఉత్సాహం, ఆసక్తిని కనబరిచారని అన్నారు.

కార్యక్రమంలో ఆర్‌టిఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్

పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుంది

- కాంగ్రెస్ పార్టీ నాయకులకు సన్మానం



నాయకులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమ దేవరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివకుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన కొరిపెల్లి లింగారెడ్డి, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మహమ్మద్ రఫీ, బొల్లాపల్లి సుమన్ గౌడ్, మండల యువజన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన దండేవోయిన సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ తరపున సన్మానించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాయల్ గాయ్స్, శివాజీ, రుద్ర సేన, యంగ్ ఫైర్, క్రేజీ బాయ్స్, సహృదయ, ఆదర్శ యూత్ చెందిన సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గుంతలో పడి బర్ల కాపరి మృతి



గుంతలో పడి మృతి చెందిన నారాయణ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ముదక్ పల్లి గ్రామంలో గల తోకల నారాయణ(39) గేదెలను కాస్తూ ఉండేవాడు. అదే గ్రామానికి చెందిన లంబాడి సర్దార్ వ్యవసాయ భూమి నందు నీటిమడిలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఫిడ్స్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ యాదగిరి గౌడ్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గురువారం హైదరాబాదులో పలు వివాహాది శుభ కార్యాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్మల్ శాసనసభ్యులు, తెలంగాణ బిజెపి ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూతురు వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు .

ఉద్యోగుల రెగ్యులైజేషన్ కోసం కృషి చేస్తా

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్.జనార్దన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఉద్యోగుల రెగ్యులైజేషన్ కోసం కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్.జనార్ధన్ తెలిపారు. గురువారం కామారెడ్డి జిల్లా మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ధర్నా చేస్తున్న తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్షణ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. 18 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యులైజేషన్ చేయించడానికి కృషిచేస్తానని వాగ్దానం చేశారు. పట్టభద్రులతో కలిసి ఆయన ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

నూతన రుణాలు మంజూరు

నవతెలంగాణ-ఆర్మూర్



ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు కొత్తగా మంజూరైన రుణాలను 32మంది రైతులకు రూ.33 లక్షలు సొసైటీ చైర్మన్ తంబురీ శ్రీనివాస్ గురువారం అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేయడంపై రైతులు ఆనంద వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్లు బార్ల సంతోష్‌రెడ్డి, కళ్ళెం సాయరెడ్డి, గోవర్ధన్, కళ్ళెం బొజరెడ్డి, మల్లు బాయి ప్రమోదు కుమార్, ఆరే రాజేశ్వర్, గొల్ల గంగాధర్, వెల్మ నర్సరెడ్డి, కట్ట నర్సయ్య, పచ్చుక లస్మ బాయి, కార్యదర్శి తొర్తి మల్లేష్, సిబ్బంది గంగన్న, ముత్యం, దేవరాజు, గంగాధర్, రాజు గంగారం, రైతులు, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణా-నవీపేట్

మండలంలోని జల్లేపల్లి వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ కుమార్ గురువారం తెలిపారు జన్నెపల్లి వాగు నుండి గురువారం ఉదయం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ను తనిఖీ చేయగా ఎటువంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సంబంధిత అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయసు పెంచాలి

- తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఏ.పున్నయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 60 నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఏ.పున్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరిల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలో 12 వర్సిటీలున్నాయని వాటిలో 2,817 మంది ప్రొఫెసర్ల మంజూరు పోస్టులకు గాను కేవలం 757 మంది మాత్రమే పనిచేయడంతో, యూనివర్సిటీల్లో బోధనతోపాటు పరిశోధనలో వెనుకబడ్డాయన్నారు. నేటి వరకు వివిధ యూనివర్సిటీలో 2,060 ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అంటే 75 శాతం ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇక ప్రతినెలా ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్, కాకతీయ, తెలంగాణ యూనివర్సిటీ, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ లో ఇద్దరు ముగ్గురి చొప్పున పదవీ విరమణ పొందుతున్నారని తెలిపారు. ఫలితంగా భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో న్యాక్ గ్రేడ్ అర్హత కోల్పోనున్నాయన్నారు. న్యాక్ గ్రేడ్ అర్హత కోల్పోవడంతో యూనివర్సిటీలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిధులు కూడా అందక యూనివర్సిటీ లన్ని నిర్వీర్యం అవుతాయని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందనంత దూరం అవుతుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వం పంపిన కామన్ యూనివర్సిటీ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును వెనక్కితీసుకొని, ఈ ప్రభుత్వం కొత్త కమిషన్ ఏర్పాటుకు మరింత సమయం పడుతుందని, కావున అనివార్యంగా ప్రొఫెసర్ల పదవి విరమణ వయస్సు పెంచనట్లయితే భవిష్యత్తులో యూనివర్సిటీల్లో అన్ని ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండే పరిస్థితి సమీపిస్తుందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 61కి పెంచారని, దీంతో వర్సిటీల్లోని బోధనేతర ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు ఆమేరకు పెరిగిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం యూనివర్సిటీలపట్ల అనుసరించిన వివక్ష కారణంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు అరవై ఏళ్లకే ఉద్యోగ విరమణ పొందుతున్నారని కేంద్రీయ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సుతో సమానంగా రాష్ట్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ల వయస్సు పెంచాలని డిమాండ్ చేశారు. మరోవైపు వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ల వయస్సును గత ప్రభుత్వమే 65కి పెంచిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోనూ ప్రొఫెసర్ల వయస్సు 65కు పెంచారని, మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోనూ 65కు చేసినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం 60 సంవత్సరాలే ఉండటంతో వర్సిటీలు కు నారిల్లుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ తక్షణమే ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 65 సంవత్సరాల వరకు పెంచాలని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందని ఏ పున్నయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి డాక్టర్ అడికే నాగరాజ్, డాక్టర్ వాసం చంద్రశేఖర్, ప్రొఫెసర్ అరుణ, ప్రొఫెసర్ అపర్ణ, ప్రొఫెసర్ సిహెచ్ ఆరతి, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ అబ్దుల్ ఖావి, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ప్రవీణ్ మామిడాల,డాక్టర్ ప్రసన్న శీల, డాక్టర్ నీలిమ, డాక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రొఫెసర్లు

దూరవిద్య పది, ఇంటర్ అడ్మిషన్లకు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆర్మూర్

దూరవిద్య పది, ఇంటర్ చదువుకోవాలనుకున్నవారికి ఓపెన్ స్కూల్ సొసైటీ మరోసారి అవకాశం ఇచ్చిందని పట్టణంలోని రామ్ మందిర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గద్దె గంగాధర్ గురువారం తెలిపారు. ఈ నెల 16 వరకు ఎవరైనా అడ్మిషన్ పొందవచ్చని, వివరాలకు 9490006312 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని కొలిప్యాక్ గ్రామంలోగల లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కూలి పని చేసిన వ్యక్తి అదృశ్యమైనట్టు ఎస్సై తిరుపతి తెలిపారు. నాగుల బాలు (45) సొంత ఊరు మహాలక్ష్మి నగర్ కాలనీ మాణిక్ బండార్ గ్రామం, మాక్లూర్ మండలం. ఈనెల 7న కొలిపాక లక్ష్మీనరసింహస్వామి గుడి వద్ద కూలిపనికి వచ్చి ఆ మర్నాటి నుండి కనబడటం లేదు. ఆయన భార్య నాగుల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే ఎస్ఐ ఫోన్ నెంబర్ 8712659853, 8712659742 కి తెలిపాలని అన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

నవతెలంగాణ-బాల్కొండ

బతుకు తెరువు కోసం దుబాయ్‌కి వెళ్లి మృతి చెందిన వ్యక్తి మృతదేహం స్వదేశానికి రావడంతో సొంత గ్రామంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. బాల్కొండ మండల పరిధిలోని బస్సాపూర్ గ్రామానికి చెందిన పస్తాం సాయిరాం(49) జీవనోపాధి కోసం ఆరు నెలల క్రితం దుబాయ్ వెళ్ళాడు. అక్కడ అనారోగ్యంతో ఈనెల ఆరవ తేదీన మృతి చెందాడు. మృతదేహం ఆరు రోజుల తర్వాత స్వదేశానికి రావడంతో అంత్యక్రియలు నిర్వహించారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



సాయిరాం(ఫైల్)

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ అంకిత్



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం మండలంలోని ఉప్లూర్, నాగపూర్, కమ్మర్ పల్లి గ్రామాలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తీరును ఆయన పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వేలో సమగ్రంగా పొందుపరచాలని సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు చోటు లేకుండా, ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. స్థలం ఉండి ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. సర్వేను పకడ్బందీగా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాగపూర్‌లో పలువు లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు.ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

ఒలంపిక్స్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలి

- మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

క్రీడాకారులు ఒలంపిక్స్ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రీడలలో సుమారు 30జట్లు పాల్గొన్నాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను, యోగ, అథ్లెటిక్స్ తదితర అంశాలలో తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. క్రీడల్లో చివరి రోజు మహతి, తెలంగాణ మోడల్ స్కూల్, సెయింట్ ఏఎస్ పాఠశాలల విద్యార్థులు యోగాలో అత్యంత ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి గ్రామీణ స్థాయి నుంచి ఒలంపిక్స్ స్థాయికి ఎదిగి ముఖ్యమంత్రి యొక్క ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. చరిత్రలో ఎన్నడు లేని విధంగా అన్ని గురుకులాల విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉన్నత పాఠశాల క్రీడా క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దుటకు తన వంతు సహకారాన్ని అందించుటకు ముఖ్యమంత్రి వద్దకు ఈ విషయాన్ని తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ భాస్కర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్, క్రీడల ఆర్గనైజర్ రాజ్ కుమార్, వేల్పూరు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ తౌట్ గంగాధర్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న మానాల మోహన్‌రెడ్డి

గురుకులాల విద్యా వ్యవస్థను తీసివేయడానికి కాంగ్రెస్ కుట్ర

- ట్విట్టర్ వేదికగా ఎమ్మెల్యే ఫైర్

నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పై తన వ్యక్తిగత ట్విట్టర్ అకౌంట్ లో గురువారం విమర్శలు గుప్పించాడు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల విద్య వ్యవస్థను తీసివేయడానికి కుట్ర పన్నుతోందని, అన్నంలో పురుగులు వస్తున్నాయని, సరైన వసతులు లేక చదువు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువు దూరం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని ట్విట్టర్లో విమర్శించారు.

మెగా జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 14న జిల్లాలో నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగపరుచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పేర్కొన్నారు. గురువారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీమార్గమే రాజ మార్గమని ఏళ్ల తరబడిగా వివిధ కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్న కక్షిదారులు ఈ లోక్ అదాలత్ ను ద్వినియోగపరుచుకోవాలన్నారు. ఇప్పటికే తమపై కోర్టుల ఆదేశాల ప్రకారం 14న మెగా లోక్ అదాలత్ ఉన్న దృష్టా గత నాలుగు ఐదు రోజుల నుండి జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని ప్రధాన పట్టణాలలోని చౌరస్తాల్లో ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి స్పీకర్లతో నిర్విరామంగా అనౌన్స్మెంట్ కార్యక్రమం కూడా చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఇందులో కేసును ఒక్కసారి పరిష్కరించుకుంటే అందులో కేసు పరిష్కారం అవుతే అట్టి కేసును శాశ్వతంగా కొట్టివేయడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న సునీత కుంచాల

కుల సంఘాల అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి సహకారంతో యాదవ, గౌడ సంఘాల అదనపు గది నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధులు రావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో భాగంగా గౌడ సంఘం అదనపు గది నిర్మాణానికి రూ.5లక్షలు, యాదవ సంఘానికి రూ.5లక్షలు నిధులు రావడం ఆనందంగా ఉందని తెలిపారు. నిధుల మంజూరుకు చొరవ చూపిన ముత్యాల సునీల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామగౌడ్, నూకల అశోక్, బెజ్జారం భాను, క్యాతం నవీన్, ఆవుల దేవన్న, గురువయ్య, బెజ్జారం శ్రీను, ప్రశాంత్ యాదవ్, ప్రభాకర్, సుదర్శన్, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

31వరకు టెండర్ ప్యాడీ పేమెంట్ చేయాలి

రాష్ట్ర చీఫ్ విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారి శశిధర్ రాజ్ రైస్ మిల్లర్స్‌తో సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర చీఫ్ విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ అధికారి శశిధర్ రాజ్ నిజామాబాద్ జిల్లా లో ఐడీఓసి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రబీ 2022-23 కు సంబందించిన టెండర్ ప్యాడి లాట్1, లాట్2, లాట్ 12 లకు సంబంధించి రైస్ మిల్లర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. టెండర్ ప్యాడికి సంబంధించి పేమెంట్ చేయుటకు 31 చివరి తేదీ కావున ఆలోపు క్లియర్ చేయుటకు తగు సూచనలు చేశారు. సమావేశంలో శశిధర్ రాజ్, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఓఎస్డి శ్రీధర్ రెడ్డి, జిల్లా మేనేజర్ పౌర సరఫరాల సంస్థ అధికారి, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కొన్ని రైస్ మిల్స్ - శ్రీ తిరుమల శ్రీనివాస ఇండస్ట్రీస్ ఖానాపూర్, సిద్ధమ్మ రైస్ ఇండస్ట్రీస్ కాలూర్ , సిద్ది రామేశ్వర ఇండస్ట్రీస్ కాలూర్, శ్రీ లక్ష్మీ ఆగ్రో ఇండస్ట్రీస్ శ్రీనగర్, శ్రీ లక్ష్మీ నరసింహ నారాయణి ఆగ్రో ఇండస్ట్రీస్ అశోక్ ఫారం లలో తనిఖీ చేశారు.




మాట్లాడుతున్న అధికారి శశిధర్‌రాజ్

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని గోవింద్ పల్లి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను తహసీల్దార్ బండారి మాలతీ పరిశీలించారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తప్పులు లేకుండా నివేదిక అందించాలని సర్వే అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రైమరి పాఠశాలతోపాటు, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం వివరాలు, స్టాకు, ఇతర సరుకులను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని, కూరగాయలు తాజాగా ఉండేవిధంగా చూడాలని, వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని, పారిశుద్యం పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఉపాధి కోర్సులపై విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలి

- సెరికల్చర్‌పై మూడు రోజుల శిక్షణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీ విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశోధనలు జరిపి ఉపాధి హామీ కోర్సులపై విద్యార్థులు దృష్టి కేంద్రీకరించాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావు అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ జంతు శాస్త్ర విభాగం విద్యార్థులకు సెరికల్చర్, కేంద్రీయ పట్టు పరిశ్రమ బోర్డు వారి ఆధ్వర్యంలో మూడు రోజులు హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ విజయవంతంగా పూర్తి చేసినందుకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు, జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న శీలను విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. ఈ ట్రైనింగ్‌లో విద్యార్థులకు మల్బరీ కల్చర్, పట్టు రోలింగ్ విధానం, చాకి గుడ్ల ఉత్పత్తి కేంద్రం నిర్వహణ, గుడ్ల ఉత్పత్తి విధానం, నూతన కల్చర్ పద్ధతులు, పోలింగ్ విధానంలో ఆధునిక యంత్రాల నిర్వహణ, క్షేత్రస్థాయి అనుభవాలను, మార్కెటింగ్ పద్ధతులను తెలియజేశారు. ఈ శిక్షణలో నేషనల్ సిల్క్ బోర్డ్ సైంటిస్ట్ డాక్టర్ వినోద్ యాదవ్, టెక్నికల్ ఆఫీసర్ రాఘవేంద్ర, హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి, సెరికల్చర్ ఆఫీసర్ ఐలయ్య రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారని విభాగాధిపతి తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సునీల్ కుమార్, విజయ్ కుమార్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో మల్లన్న స్వామి ఉత్సవాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులోని దూలగుట్టపై వెలిసిన మల్లన్న స్వామి ఉత్సవాలు ప్రారంభమైనట్టు యాదవ సంఘం అధ్యక్షులుగణేష్ గురువారం తెలిపారు. మల్లన్న స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి పల్లికి సేవ ఊరేగింపు, శనివారం రోజున స్వామి వారికి మైలేలు తీయడం, ఆదివారం గంగా నీళ్ల, స్వామి వారినీ ఎదుర్కోవడం, సోమవారం బోనాలు ఊరేగింపు, మల్లన్న స్వామి వారి కళ్యాణం, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి దేవన్న, హరీష్, బూమన్న, రాజు, అబ్బాస్, మహేష్, భోగాన్న, సుబ్బు, చిన్నయ్య, కుల పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.



రోడ్డు కాదు.. పక్కా రిజిస్ట్రేషన్ ప్లాట్

- ఎమ్మెల్సీ కవితకు, రామ్ కిషన్ రావుకు ఎటువంటి సంబంధం లేదు
- అనవసరంగా ఆర్‌కె అపార్ట్మెంట్ సభ్యుల రాద్ధాంతం
- స్థల యజమాని నగేష్ కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్ లో ఉన్న ఆర్కేఆర్ అపార్ట్మెంట్ రోడ్డు వివాదం సంబంధించి స్థలం రిజిస్ట్రేషన్ ప్లాట్ అని జన్నెపల్లికి చెందిన స్థల యజమాని కొండూరు నగేష్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్కెఆర్ అపార్ట్మెంట్ సంబంధించిన వాళ్ళు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని, ప్లాట్‌ను రహదారిగా చిత్రీకరిస్తూ అనవసరంగా రాజకీయ రంగు పులుముతున్నారని అన్నారు. వివాదం చేస్తున్న దారిలో అది తన సొంత ప్లాట్ అని 219 సర్వేనెంబర్ లో ఉన్న 235 గజాల ప్లాటు 2018 లోనే రిజిస్ట్రేషన్ చేసుకున్నానని తెలిపారు. తన స్థలం కబ్జా చేయడానికి వారు ప్రయత్నిస్తున్నారని ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు . కొందరు వ్యక్తులు కావాలని రాజకీయ రంగు పులుమాలని చూస్తున్నారని దానిలో భాగంగానే ఎమ్మెల్సీ కవిత, రామ్ కిషన్ రావుల గురించి ప్రస్తావిస్తున్నారని అన్నారు. వారికి ఈ స్థలంతో ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. తన వద్ద స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నాయని మున్సిపల్ కార్పొరేషన్‌లో టాక్స్ సైతం చెల్లిస్తున్నానని ఎవరు ఎప్పుడు అడిగినా వివరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.